

పరిశ్రమ ఏర్పాటు చేయండి కానీ..
ఫెర్రో అల్లాయ్ పరిశ్రమ ఏర్పాటుకు తాము సానుకూలమేనని, కానీ సోడియం ఉత్పత్తులు చేయొద్దని ప్రజలు కోరారు. - 8లో



పార్టీని బలోపేతం చేయాలి
సంస్థాగతంగా సీపీఎంను బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. - 8లో



న్యూస్‌రీల్

రేపటి నుంచి ఉచిత బియ్యం

నల్లగొండ : ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు కలిగిన వారందరికీ ఈ నెల 5వ తేదీకి బదులుగా 7 (శనివారం) నుంచి ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రేషన్ షాపులకు బియ్యం అందించామని, ఆహార భద్రత కార్డుదారులు 5 కేజీల చొప్పున, అంత్యోదయ కార్డుదారులు 35, అన్నపూర్ణ కార్డుదారులు 10 కేజీల చొప్పున ఉచితంగా బియ్యం అందించనున్నట్టు పేర్కొన్నారు.

ఉపాధి పథకంతో మెరుగైన అభివృద్ధి



ఢిల్లీలో తెలంగాణ పథకాలను కేంద్ర మంత్రికి వివరిస్తున్న నార్కట్‌పల్లి ఎంపీపీ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో జిల్లాలో మెరుగైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి కపిల్‌పాటిల్‌కు వివరించినట్లు నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌పై ఢిల్లీలో బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన నేషనల్ వర్క్ షాప్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల గురించి వర్క్ షాప్‌లో వివరించినట్లు తెలిపారు.

హెల్త్ ప్రొవైడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఖాళీగా ఉన్న 104 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమల్ల కొండల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ ఆయుర్వేదిక్ పోస్టులకు ఎంబీబీఎస్ అర్హత, స్టాఫ్‌నర్సు పోస్టుకు బీఎస్సీ నర్సింగ్ 2020 విద్యాసంవత్సరం తరువాత ఉత్తీర్ణులై ఉండి బీఎస్ నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదై ఉండాలని పేర్కొన్నారు. అలాగే బీఎస్సీ నర్సింగ్ 2020 విద్యాసంవత్సరం ముందు ఉత్తీర్ణులై ఉండి టీఎస్‌నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదై ఉండాలని, కమ్యూనిటీ హెల్త్ నందు 6నెలల బ్రిడ్జి కోర్సు చేసి ఉండాలని తెలిపారు. స్టాఫ్ నర్సు జీఎన్ఎం కోర్సు పూర్తి చేసి టీఎస్ కౌన్సిలింగ్‌లో నమోదై కమ్యూనిటీ హెల్త్ నందు 6నెలల బ్రిడ్జి కోర్సు చేసి ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 7వ తేదీ సాయంత్రం 5గంటలలోపు రూ.200 రుసుము చెల్లించి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోండి

నల్లగొండ : ఫిజికల్ టెస్ట్‌లో అర్హత సాధించి ఎస్ఐ, కానిస్టేబుల్ మెయిన్స్ సిద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఇచ్చే ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తులు నేరుగా నల్లగొండలోని ఎన్జీ కాలేజీ వెనుక ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో చేసుకోవాలని పేర్కొంది. శిక్షణ కాలంలో అభ్యర్థులు 75శాతం హాజరు శాతం ఉంటే నెలకు రూ.వెయ్యిచొప్పున స్టైఫండ్ ఇస్తామని, వివరాలకు 08682-220007 నంబర్‌ను సంప్రదించాలని కోరింది.

ఎంజీయూ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2023 డైరీని గురువారం యూనివర్సిటీలో వీసీ గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీలో యూనివర్సిటీ సమాచారం సమగ్రంగా ఉందని, ఇది విద్యార్థులు, సిబ్బందికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ అంజిరెడ్డి, రవి, శ్రీదేవి, రమేష్, ప్రేమ్‌సాగర్, మద్దిలేటి, హరీష్‌కుమార్, రేఖ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సాహం

నల్లగొండ టూటౌన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేపీఎం ప్రభుత్వ బాలుర కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఆద్యంతం అలరించాయి. విద్యార్థులు, యువత వివిధ కళలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వివేకానంద చూపిన మార్గంలో యువత నడవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి దండెంపల్లి సత్తయ్య, కటికం సత్తయ్యగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రి, కౌన్సిలర్లు బోయినపల్లి శ్రీనివాస్, సమి, దేవేందర్, యాదగిరి, రాజేందర్, బాలు, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.





యువజనోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

స్వల్పంగా పెరుగుదల

జిల్లాలో ఓటర్ల సంఖ్య 13,55,482

- డ్రాఫ్ట్ జాబితాతో పోల్చితే మూడు నియోజకవర్గాల్లో పెరిగారు
- మరో మూడు నియోజకవర్గాల్లో తగ్గారు
- నల్లగొండలో 25 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదు
- తుది ఓటరు జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం

జిల్లా మొత్తంగా ఓటర్ల సంఖ్య మునుగోడు నియోజకవర్గంలో(2,40,093) అత్యధికంగా, మిర్యాలగూడ నియోజకవర్గంలో (2,11,898) తక్కువగా ఉంది.

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నల్లగొండ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరగగా, మరికొన్ని నియోజకవర్గాల్లో తగ్గిపోయింది. రెండు నెలల కంటే తక్కువ సమయంలోనే పలు నియోజకవర్గాల్లో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. అక్కడ నవంబరు నెలలో కంటే ఇప్పుడు 2,860 మంది ఓటర్లు పెరిగారు. 2022 నవంబరు 9వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలో పేర్కొన్న ఓటర్ల సంఖ్య కంటే గురువారం ప్రకటించిన తుది ఓటరు జాబితాలో జిల్లా మొత్తంలో ఓటర్ల సంఖ్య స్వల్పంగానే (661) పెరిగింది. ముసాయిదా జాబితాలో 13,54,821 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు ఓటర్ల సంఖ్య 13,55,482కు పెరిగింది. ఇక మూడు నియోజకవర్గాల్లో మాత్రం ఓటర్ల సంఖ్య తగ్గిపోగా, మరో మూడు నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. స్థానికంగా లేకుండా, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓటర్ల పేర్లను జాబితానుంచి తొలగించారు. మరికొంత మంది రెండు మూడు చోట్ల ఓటరుగా పేరు నమోదై ఉండటంతో ఏదో ఒక చోటే ఓటు హక్కు ఉంచుకొని తొలగింపునకు అంగీకరించినవారు ఉన్నారు. ఆధార్ అనుసంధానంతో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇక 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు పొందారు. నల్లగొండలో కొత్తగా 25 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటరు జాబితాలో చేరారు.

ఓటర్ల సంఖ్యలో చోటుచేసుకున్న మార్పులివీ..

- నల్లగొండలో ముసాయిదా జాబితాకంటే ఫైనల్ జాబితా వచ్చే సరికి 2,358 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో 819 మంది పురుషుల ఓట్లు, 1514 మహిళల ఓట్లు పెరిగాయి. కొత్తగా 25 ట్రాన్స్‌జెండర్ ఓట్లు పెరిగాయి. నవంబరులో 2,22,100 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 2,24,458కి పెరిగింది.
- మిర్యాలగూడలో ముసాయిదా జాబితా కంటే ఫైనల్ జాబితా వచ్చే సరికి 2,860 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో 1,262 మంది పురుషుల ఓట్లు, 1592 మహిళల ఓట్లు పెరిగాయి. నవంబరులో 2,09,038 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2,11,898కు పెరిగింది.
- నకిరేకల్ నియోజకవర్గంలో ముసాయిదా జాబితాకంటే ఫైనల్ జాబితాలో 893 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో 272 మంది పురుషుల ఓట్లు, 621 మహిళల ఓట్లు పెరిగాయి. నవంబరులో 2,32,727 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 2,33,620 మంది ఓటర్లు ఉన్నారు.
- దేవరకొండ నియోజకవర్గంలో ముసాయిదా జాబితాతో పోల్చితే ఫైనల్ జాబితాలో 2086 మంది ఓటర్లు తగ్గిపోయారు. 1038 మంది పురుషుల ఓట్లు, 1048 మహిళల ఓట్లు తగ్గిపోయాయి. నవంబరులో 2,29,846 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు 2,27,760కి తగ్గిపోయింది.
- నాగార్జునసాగర్‌లో ముసాయిదా జాబితాకంటే ఫైనల్ జాబితా వచ్చే సరికి 1652 మంది ఓటర్లు తగ్గిపోయారు. ఇందులో 1015 మంది పురుషుల ఓట్లు, 637 మహిళల ఓట్లు తగ్గిపోయాయి. నవంబరులో 2,19,305మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2,17,653కి తగ్గిపోయింది.
- మునుగోడులో ముసాయిదా జాబితాకంటే ఫైనల్ జాబితాలో 1712 మంది ఓటర్లు తగ్గిపోయారు. ఇందులో 853 మంది పురుషుల ఓట్లు, 859 మహిళల ఓట్లు తగ్గిపోయాయి. నవంబరు నెలలో 2,41,805 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు ఓటర్ల సంఖ్య 2,40,093కి తగ్గిపోయింది.



నేడు చండూరుకు కేటీఆర్ రాక

- మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



చండూరు : మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శుక్రవారం చండూరు మున్సిపల్ కేంద్రానికి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హుజూర్‌నగర్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 2:30 గంటలకు చండూరు పట్టణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా 3 గంటలకు గట్టుప్పల్ మండల కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ క్లస్టర్ డెవెలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తారు. 3: 30 గంటలకు గట్టుప్పలలో రూ.2 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 3:45గంటలకు గట్టుప్పల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 4:15గంటలకు చండూరు పట్టణానికి చేరుకుంటారు. సీసీ రోడ్లతోపాటు డ్రెయినేజీ పనులకు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, మున్సిపల్ బిల్డింగ్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు చండూరు నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

శంకుస్థాపనలు చేసేదిక్కడే..

మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా మంత్రులు ఇచ్చిన హామీలు అమలు కాబోతున్నాయి. సుమారుగా రూ.10 కోట్ల నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు మంత్రులు శ్రీకారం చుట్టనున్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2.50కోట్లతో సీసీ డ్రెయినేజీలు, ప్రభుత్వం నిధులు రూ.2కోట్లతో సమీకృత మార్కెట్, మరో రూ.2కోట్లతో మున్సిపల్ బిల్డింగ్, రూ.50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపనలు చేపడతారు. వీటితోపాటు గట్టుప్పల మండల కేంద్రంలో రూ.1.70 కోట్లతో ఏర్పాటు చేయబోయే రెండు చేనేత క్లస్టర్లు, రూ.2 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థానపలు చేస్తారు.

అభివృద్ధికి మరో రూ.30కోట్లు!

చండూరు మున్సిపల్ అభివృద్ధికి మరో 30 కోట్లు నిధులు మంజూరు చేసే అవకాశం ఉన్నట్టు అధికారుల ద్వారా తెలిసింది. ఇందులో రూ.22 కోట్ల నిధులతో మున్సిపాలిటీలో డ్రెయినేజీలతో కూడిన డబుల్ రోడ్డు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు రూ.8 కోట్లు సీసీ రోడ్లు, పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఇందుకు సంబంధించిన పనుల ప్రారంభానికి కూడా శిలాఫలకాలు సిద్ధంగా ఉంచారు.

ఏర్పాట్ల పరిశీలన

చండూరుకు మంత్రుల రాక సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, అదనపు డీఆర్‌డీఓ శైలజ, తహసీల్దార్ గణేష్, ఎంపీడీఓ యాకూబ్ నాయక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్నలకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.



చండూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అధికారులు



చండూరు మున్సిపల్ పరిధిలోని అంగడిపేట శివారులో హెలిపాడ్ ఏర్పాటు పనులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- విద్యాశాఖ అధికారి భిక్షపతి



హాలియా కేజీబీవీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

హాలియా, పెద్దవూర : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం ఆయన హాలియాలోని కేజీబీవీ, పెద్దవూర మండలం కొత్తగూడెం, చిన్నగూడెం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల పలు రికార్డులు, విద్యార్థులల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆయన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. ఈ సందర్భంగా డీఈఓ బిక్షపతి మాట్లాడుతూ రాబోయే వార్షిక పరీక్షలకు పది, ఇంటర్ విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ బోధనా విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మన ఊరు–మన బడి కింద ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా దగ్గరుండి పనులు పూర్తయ్యేలా చూసి ఈ నెల 9వ తేదీ వరకు కనీసం రెండు పాఠశాలలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ బాలు నాయక్, నోడల్ అధికారి కె.శ్రీనివాస్, కేజీబీవీ ఎస్ఓ హైమావతి, వెంకటరమణ, జ్యోతి తదితరులు ఉన్నారు.

నర్సరీలను సిద్ధం చేయాలి

పెద్దవూర: అన్ని గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలను సిద్ధం చేయాలని డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సెగ్రిగేషన్ షెడ్, వన నర్సరీలను పరిశీలించి మాట్లాడారు. ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు పెంచి మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ప్రతి నర్సరీలో ఎర్రమట్టిని నింపిన కవర్లలోనే విత్తనాలు నాటడం ప్రారంభించాలని సూచించారు. నాటిన ప్రతి గింజ మొలిచేలా చూడాలని పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కూస్‌రెడ్డి విజయాకుమారి, సర్పంచ్ నడ్డి లింగయ్య, పంచాయతీ కార్యదర్శి పానుగోతు ధాకునాయక్ తదితరులు ఉన్నారు.



పెద్దవూరలో సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి

క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు ప్రారంభం

కేతేపల్లి : జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కేతేపల్లి జపమాలమాత చర్చిలో గురువారం రాత్రి క్రీస్తు సాక్షాత్కార (ముగ్గురు రాజుల పండగ) వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను చర్చి విచారణ గురువు మాదాను ఫ్రాంచీస్ అధ్యక్షతన క్రైస్తవ మత గురువులు ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలతో ప్రారంభించారు. గ్రామంలోని క్రైస్తవ భక్తులందరూ మొక్కులు చెల్లించుకునేందుకు చర్చికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి చర్చిలో ప్రదర్శించిన ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే ముగ్గురు రాజుల నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పండగ సందర్భంగా ఆలయం వెలుపల పెద్ద జాతర వెలిసింది. అంతకు ముందు వేడుకల ప్రారంభం సందర్భంగా చర్చి కమిటీ ఆధ్వర్యంలో పేల్చిన బాణసంచా ఆకాశంలో రంగు రంగుల కాంతులతో మిరుమిట్లు గొలిపింది. వేడుకల్లో చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యయ్య, మాదాను బాలస్వామి, ఆర్లగడ్డ అమర్, జోసఫ్, విజయ్‌రాజు, విజయ్‌కుమార్, ధన్‌రాజ్, పాలిశెట్టి జోజప్ప, శౌరి, గుద్దింటి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లి చర్చిలో ముగ్గురు రాజుల పౌరాణిక నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

హామీల అమలులో ప్రధాని మోదీ విఫలం



చిట్యాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తదితరులు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

చిట్యాల: విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ వాటి అమలులో పూర్తిగా విఫలం అయ్యారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. చిట్యాల మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులు మూడు కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని గురువారం ఆయన ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. మోదీని గద్దె దించేందుకే కేసీఆర్ నాయకత్వంలో భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)పార్టీ ఏర్పాటైందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లు పెట్టబోమని తెలిపారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నారన్నారు. బ్రహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. చిట్యాల మున్సిపాలిటీలో సుమారుగా ఇరవై కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, ఎంపీపీ కొలను సునీతవెంకటేష్, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ యాదగిరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, కౌన్సిలర్లు, అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళా

- అన్ని ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ
- ఇప్పటికే మండల స్థాయిలో పూర్తి
- ఉపాధ్యాయులే ప్రదర్శించనున్న బోధనోపకరణాలు
- 'తొలిమెట్టు'లో భాగంగా నిర్వహణ

నల్లగొండ: ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యాశాఖ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే గత నెల 28 నుంచి మండల స్థాయిలో మేళాలు నిర్వహించారు. ఈ నెల 10న జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ఆ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. దీంట్లో భాగంగా ఏర్పాట్లు సైతం చేస్తున్నారు.

ఉపాధ్యాయులతోనే బోధనోపకరణాలు తయారీ..

విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే విధంగా బోధించేందుకు వివిధ సబ్జెక్టులకు సంబంధించి ఉపకరణాలు తయారు చేస్తారు. వాటిని చూపుతూ బోధన చేయడం వల్ల విద్యార్థులకు సులువుగా అర్థం అవుతుందని ప్రభుత్వ ఉద్దేశం. ఇందులో భాగంగానే ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే బోధనోపకరణాలు తయారు చేయించి ప్రదర్శిస్తున్నారు. ఒక్కో మండలం నుంచి పది మంది చొప్పున.. మండలస్థాయిలో నిర్వహించిన మేళాల్లో ఎంపికైన ఉపాధ్యాయులచే ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఒక్కో మండలం నుంచి 5 సబ్జెక్టులకు ఫస్ట్, సెకండ్ తరహాలో ఎంపిక చేసి సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున 10 మంది ఉపాధ్యాయులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఉర్దూ మీడియంలో కూడా సబ్జెక్టు టీచర్లను జిల్లాస్థాయి సబ్జెక్టుల వారీగా ఎంపిక చేశారు. వీరంతా స్వయంగా తయారు చేసిన బోధనోపకరణాలను ఈనెల 10న జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శిస్తారు. అయితే జిల్లాస్థాయిలో కూడా ఆయా సబ్జెక్టుల వారీగా ఒక్కో సబ్జెక్టులో ఫస్ట్, సెకండ్ కేటగిరీలుగా విభజించి మంచి ఉపకరణాలు తయారు చేసిన టీచర్లను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం మేళాకు పంపించనున్నారు.



మునుగోడులో టీఎల్‌ఎం మేళాలో బోధనోపకరణాలను పరిశీలిస్తున్న డీఈఓ (ఫైల్)

సామర్థ్యాలు పెంపొందించేందుకే..

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమం ద్వారా టీఎల్‌ఎం మేళాలు నిర్వహిస్తున్నాం. జిల్లా స్థాయిలో మేళాలో పాల్గొనబోయే ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకు అనుగుణంగా బోధనోపకరణాలను తయారు చేసుకొని వచ్చి ప్రదర్శించాలి.

– భిక్షపతి, డీఈఓ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


ఘటనా స్థలిలో స్రవంతి మృతదేహం


బొబ్బలి స్రవంతి (ఫైల్)

మద్దిరాల: విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతిచెందిన ఘటన మండలంలోని రెడ్డిగూడెంలో గురువారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన బొబ్బలి మహేష్ రెడ్డిగూడెం గ్రామంలో భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నాడు. ఈ క్రమంలో మహేష్ భార్య స్రవంతి(28) పొలంగట్టుపై నడుచుకుంటూ నాటు వేసే కూలీల దగ్గరకు వెళ్తుండగా అప్పటికే తెగి ఉన్న కరెంట్ వైరుకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం.

రాజాపేట మండలంలో..

రాజాపేట: విద్యుత్ షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బూడిద రవి(40) తన వ్యవసాయ బావి వద్దకు ఉదయం వెళ్లాడు. పారతో పొలం గట్టుపై వరం తీస్తూ పక్కనే ఉన్న బోరు మోటారు స్టార్టర్‌కు ఉన్న వైరు సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి వరకు భర్త ఇంటికి రాకపోవడంతో రవి భార్య, కుటుంబ సభ్యులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా పొలంలో విగతజీవిగా కనిపించాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరిశ్రమ ఏర్పాటు చేయండి కానీ..

- సోడియం సంబంధిత ఉత్పత్తులు చేపట్టవద్దు
- ప్రజాభిప్రాయ సేకరణలో తేల్చిచెప్పిన వాడపల్లి, ఇర్కిగూడెం గ్రామస్తులు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు


ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన ఎమ్మెల్యే భాస్కర్‌రావు, స్థానిక ప్రజలు

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని వాడపల్లి, ఇర్కిగూడెం గ్రామ శివారులో గతంలో 65మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ కోసం కేటాయించిన స్థలంలో ప్రస్తుతం రూ.720కోట్లతో చేపట్టిన ఫెర్రో అల్లాయ్ పరిశ్రమ నిర్మించేందుకు గాను గురువారం పరిశ్రమ ప్రాంగణంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణకు స్థానికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. పరిశ్రమ ఏర్పాటుకు తాము సానుకూలమేనని, కానీ అందులో సోడియం సంబంధిత ఉత్పత్తులు చేపట్టవద్దని కోరారు. మండలంలో ఇప్పటికే డెక్కన్ క్రోమైట్ పరిశ్రమ వ్యర్థాలతో పాటు వివిధ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో సతమతమవుతున్నామని అన్నారు. అనంతరం మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ.. పరిశ్రమలు స్థాపించే సమయంలో ఇచ్చిన అన్ని హామీలను కచ్చితంగా అమలు చేయాలని, స్థానిక యువతకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ పరిశ్రమ కారణంగా సమీప వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లితే మార్కెట్ ధరకు రెండింతలు చెల్లించి కొనుగోలు చేయాలని, రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. 172 ఎకరాల్లో 130 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్‌తో పాటు స్టీల్ పరిశ్రమను నిర్మిస్తామని, 500 మందికి శాశ్వత ఉద్యోగాలు, 450 మందికి కాంట్రాక్ట్ ఉద్యోగాలు, మరో వెయ్యి మందికి నిర్మాణ సమయంలో ఉపాధి కల్పిస్తామని ఫెర్రో అల్లాయ్ పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. పరిశ్రమ ఏర్పాటైన తర్వాత మరో 10వేల మందికి పరోక్షంగా లబ్ధి చేకూరుతుందని వారు పేర్కొన్నారు.

సోడియం సంబంధిత ఉత్పత్తులకు ససేమిరా...

ఫెర్రో అల్లాయ్ పరిశ్రమలో సోడియం శాకరిన్‌తో పాటు దాని అనుబంధ ఉత్పత్తుల తయారీ ప్రతిపాదనను భవిష్యత్తులో తీసుకురావద్దని స్థానికులు డిమాండ్ చేశారు. పరిశ్రమలో వెలువడే వ్యర్థాలను సమీపంలో ఉన్న కృష్ణానదిలో కలవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. దామరచర్లలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. పరిశ్రమ ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మొండిచేయి చూపుతున్నారన్నారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలతోనే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ పరిశ్రమ వల్ల కూడా కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పలువురు ఆరోపించారు. హానికర రసాయన వ్యర్థాల నుంచి తమకు రక్షణ కల్పించాలని పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐలు రాఘవేందర్, నిగిడాల సురేష్‌కుమార్, సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలి


- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: సంస్థాగతంగా సీపీఎంను బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని టీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేపట్టి గ్రామశాఖలను బలోపేతం చేయాలన్నారు. బీజేపీ వేస్తున్న ఎత్తుగడలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి వారిని చైతన్యపర్చాలన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులకు ఆదరణ పెరిగిందని, దీనిని అవకాశంగా ఉపయోగించుకుని భవిష్యత్తులో బలమైన ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఫిబ్రవరిలో మిర్యాలగూడలో నిర్వహించనున్న గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు జగదీశ్, రాంనాయక్, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, శశిధర్‌రెడ్డి, మంగారెడ్డి, పరశురాములు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- తెలంగాణ ప్రజారోగ్య వైద్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాస్‌రావు


మంత్రి జగదీశ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్‌రావు

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వైద్యరంగ అభివృద్ధికి మంత్రి జగదీశ్‌రెడ్డి అందిస్తున్న సహకారాన్ని వైద్య సిబ్బంది స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని తెలంగాణ ప్రజారోగ్య వైద్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేస్తున్నారని అన్నారు. పీహెచ్‌సీలలో వైద్య ఉపకరణాలు, సిబ్బందికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట తెలంగాణ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండస్ సుదర్శన్, యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

వేధింపులకు గురిచేస్తున్నాడని కత్తితో దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు


చికిత్స పొందుతున్న రమేష్

నల్లగొండ క్రైం: తన అన్న కుమార్తెను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు ఓ ఆటో డ్రైవర్. ఈ సంఘటన గురువారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్‌కు చెందిన రాయల రామలింగం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రామలింగం అన్న కుమార్తెను నల్లగొండ మండలంలోని తొరగల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగమల్ల రమేష్ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇది మనసులో పెట్టుకున్న రామలింగం గురువారం పట్టణంలోని ప్రకాశం బజారులో బైక్‌పై వెళ్తున్న రమేష్‌ను అడ్డగించి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన రమేష్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడికి ప్రమాదం ఏమీలేదని వైద్యులు తెలిపారు. అయితే బాధితుడు, నిందితుడు ఇద్దరూ ఆటో డ్రైవర్లు కావడంతో పాటు వీరికి బంధుత్వం ఉందని, గతంలోనూ రామలింగం పలుమార్లు ఇదే విషయమై రమేష్‌ను పెద్దమనుషుల సమక్షంలో పద్ధతి మార్చుకోవాలని సర్ది చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. బాధితుడు రమేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు.

విజిలెన్స్ అధికారినంటూ బెదిరింపులు..

- మూడేళ్ల జైలు శిక్ష

మిర్యాలగూడ: విజిలెన్స్ అధికారినంటూ ఎరువుల దుకాణం యజమానిని బెదిరించిన వ్యక్తికి మిర్యాలగూడ రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి. మాధవి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కంకిపాడు మండలం రావులూరు గ్రామానికి చెందిన ఐతం రవిశంకర్ 2019లో దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామం వద్ద గల రైతుమిత్ర ఎరువుల దుకాణంలోకి వెళ్లి విజిలెన్స్ అధికారినంటూ యజమాని కటికం కృష్ణారెడ్డిని బెదిరించి అతడి వద్ద నుంచి రూ.60వేల నగదు, ఒక బంగారు, రెండు వెండి ఉంగరాలను తీసుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి వాడపల్లి ఎస్ఐ కె. నర్సింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణలో భాగంగా నిందితుడు రవిశంకర్‌పై నేరం రుజువు కావడంతో గురువారం మిర్యాలగూడ రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి. మాధవి సాక్ష్యాధారాలు పరిశీలించి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. దీపారాణి వాదించగా, ఆమెకు కోర్టు కానిస్టేబుల్ జాని సహకరించారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడలకు ఎంపిక

నడిగూడెం: మండల కేంద్రానికి చెందిన కేశబోయిన మురళీకృష్ణ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడలకు ఎంపికయ్యాడు. తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2022–23 సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ తరఫున షాట్‌పుట్ క్రీడకు ఎంపికైనట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పీజీ చదువుతున్న మురళీకృష్ణను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ తంగడ కిషన్‌రావు అభినందించారు.

రజకుల రెగ్యులరైజ్‌కు కృషిచేస్తా


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆనవాయితీగా సేవలు మోసే రజకుల రెగ్యులరైజ్‌కు కృషిచేస్తానని ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య అన్నారు. గురువారం ఆయన యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఆయనకు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాదాద్రి దేవాలయంలో రజకులను రెగ్యులరైజ్ చేసే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో రజక భవనం నిర్మాణానికి తన వంతుగా సాయం అందిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు రజక సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వైకుంఠద్వారం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ నాగపూరి నర్సింహ, మాజీ సర్పంచ్ నమిలే పాండు, రాయగిరి రాజు, జూపల్లి నగేష్, పాండురాజు ఉప్పలయ్య, బొజ్జ శ్రీను, గడసంతల మల్లేష్ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


కప్పల యాదయ్య

అడ్డగూడూరు: చిట్టీల వ్యాపారం చేసి అప్పుల పాలైన వ్యక్తి మానసిక ఒత్తిడికి లోనై ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు అడ్డగూడూరు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన కప్పల యాదయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. యాదయ్య సంవత్సరం క్రితం గ్రామంలో చిట్టీల వ్యాపారం మొదలుపెట్టగా అందులో నష్టం వచ్చింది. దీంతో యాదయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి చిన్నపడిశాల గ్రామానికి వలస వెళ్లి తమ బంధువు అయిన పూజారి భిక్షమయ్య వ్యవసాయ భూమిని కౌలుకి తీసుకుని సాగుచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో చిట్టీ డబ్బులు కట్టిన వారు తమ డబ్బులు చెల్లించాలని యాదయ్యపై ఒత్తిడి తీసుకురావడంతో మానసిక ఒత్తిడికి లోనైన అతడు ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆటోలో తిరుమలగిరి మండల కేంద్రానికి వెళ్లి తిరిగి రాలేదు. యాదయ్య కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం యాదయ్య భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం..


భాను

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విద్యార్థి తిరిగి ఇంటికి రాలేదు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండల పరిధిలోని దొండపాడు గ్రామానికి చెందిన తిరుమలగిరి లక్ష్మయ్య, యశోద దంపతుల కుమారుడు భాను స్థానిక పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అతడు పాఠశాలకు సరిగ్గా వెళ్లడం లేదని తల్లి మందలించగా ఈ నెల 3వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా భాను ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. భాను వయస్సు 16ఏళ్లు ఉంటుందని, ఎత్తు 4.5 అడుగులు, చామనఛాయ రంగు, నలుపు రంగు ప్యాంట్, నీలం రంగు చొక్కా వేసుకున్నట్లు పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు మృతి

నార్కట్‌పల్లి: దైవదర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. వివరాలు.. నార్కట్‌పల్లికి చెందిన కొప్పు లింగస్వామిగౌడ్, కొండ కృష్ణగౌడ్ స్నేహితులు. వీరు తమ కుటుంబ సభ్యులతో కలసి డిసెంబర్ 25న ధర్మపురి పుణ్యక్షేత్రానికి అద్దె కారులో బయల్దేరారు. మార్గమధ్యలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొప్పు సుజాత తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందగా, కొండ అనిత(37) హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

మోతె మండల వాసి..


అనిత (ఫైల్)

మోతె: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల పరిధిలో సిరికొండ గ్రామానికి చెందిన ఉప్పుల ఎల్లమ్మ మంగళవారం కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో కాశీగూడెం వైపు వెళ్తున్న ఎస్‌కే నన్నెసాబ్ బైక్‌ను అజాగ్రత్తగా నడుకుంటూ వచ్చి ఎదురుగా ఎల్లమ్మను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఎల్లమ్మను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఉప్పుల వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగభూషణం తెలిపారు.

విద్యుత్ సవరణ బిల్లును కేంద్రం వెనక్కి తీసుకోవాలి

- రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య


విద్యుత్ బీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్. కృష్ణయ్య, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. గురువారం యాదగిరిగుట్టలో నిర్వహించిన తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ మహాసభలో ఆయన పాల్గొని డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పోస్టింగ్ విషయంలో బీసీ ఇంజనీర్లు, అధికారులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లను సమీక్షించి, బీసీ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. 2009 నుంచి నేరుగా నియమించిన ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన ప్రకటించాలని పేర్కొన్నారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వినియోగదారులకు మంచి సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొడెపాక కుమారస్వామి, ముత్యం వెంకన్నగౌడ్, బ్రహ్మేందర్‌రావు, మారం శ్రీనివాస్, ఎస్. వెంకటేష్, పి. యాదగిరి, ఎం. అశోక్‌కుమార్, ఎం. విజయ్‌కుమార్, డాక్టర చంద్రుడు, కిషోర్ తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆలేరురూరల్: భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆలేరు ఎస్ఐ ఇద్రీస్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొలనుపాక గ్రామంలో సుమారు 55సంవత్సరాలు పైబడిన వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అతడు ఆహారం సరిగ్గా తీసుకోకపోవడంతో ఆరోగ్యం క్షీణించగా స్థానికులు బుధవారం ఉదయం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం సదరు వ్యక్తిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ రాత్రి చనిపోయాడు. కొలనుపాక గ్రామస్తుడు న్యతకాని కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బి. వెల్లంల గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన చిరుమర్తి స్వామి(25) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఆరు నెలల నుంచి అతడు మద్యానికి బానిసై ఎటువంటి పనిచేయకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యం చెడిపోయి మానసికంగా కృంగిపోయిన స్వామి డిసెంబర్ 31న కోమటిరెడ్డి రామిరెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గడ్డి మందు తాగి ఇంటికి వచ్చి ఇంట్లోని తన అన్నకు విషయం చెప్పాడు. దీంతో వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఇద్దరు బాలికలను బంధించిన యువకుడు


యువకుడి ఇంటి ముందు గుంపుగా నిలబడిన వారిని చెదరగొడుతున్న పోలీసులు


దగ్ధమైన బైక్

- ఆగ్రహంతో యువకుడి ఇంటిపై దాడి చేసిన బాలికల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు
- ఇంటి ఆవరణలోని బైక్‌లకు నిప్పు
- పోలీసులపైకి రాళ్లు రువ్వడంతో వాహనం ధ్వంసం, సిబ్బందికి గాయాలు
- బీఎన్ తిమ్మాపురం గ్రామంలో ఉద్రిక్తత

భువనగిరి: ఇద్దరు బాలికలను ఓ యువకుడు తన ఇంట్లో బంధించి భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ సంఘటన గురువారం యాదాద్రి జిల్లా భువనగిరి మండల పరిధిలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన మేడబోయిన యాకేష్ తల్లిదండ్రులు పని నిమిత్తం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్నారు. పాఠశాలకు వెళ్లిన ఆ ఇద్దరు బాలికలు మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వారికి మాయమాటలు చెప్పిన యాకేష్ తన ఇంటి ముందు నుంచి తాళం వేసి వెనుక వైపు నుంచి ఇంట్లోకి తీసుకెళ్లాడు. కాగా సాయంత్రం వరకు బాలికలు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. మధ్యాహ్నం బాలికలు యాకేష్ ఇంటికి వెళ్లినట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు తాళం వేసి ఉన్న ఇంటి వెనుకకు వెళ్లి చూడగా లోపలి నుంచి గడియ పెట్టి ఉండటం గుర్తించారు. దీంతో ఇంటి కిటికీ అద్దాలను ధ్వంసం చేయగా బాలికలు అందులో ఉండడం చూసి కోపోద్రిక్తులై ఇంటి ఆవరణలో ఉన్న రెండు బైక్‌లకు నిప్పు పెట్టారు. ఇది గమనించిన యాకేష్ ఇద్దరు బాలికలను బయటకు పంపి తాను లోపలే ఉన్నాడు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

గ్రామంలో ఉద్రిక్తత..

సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునే సమయానికి గ్రామస్తులు యాకేష్ ఇంటి ఎదుట పెద్దఎత్తున గుమిగూడారు. ఈ క్రమంలో యాకేష్‌పై గ్రామస్తులు దాడి చేసేందుకు యత్నించగా పోలీసులు లాఠీచార్జి చేసి అక్కడ ఉన్న వారిని చెదరగొట్టారు. యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో కొంతమంది రాళ్లు విసరడంతో పోలీసు వాహనం అద్దాలు పగిలాయి. ఒక పోలీస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు విద్యార్థినులను పోలీస్ స్టేషన్‌కు తరలించి మహిళా పోలీసులతో విచారణ నిర్వహిస్తామని భువనగిరి రూరల్ సీఐ వెంకటేశం పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేస్తామని రూరల్ ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి దగ్ధమవుతున్న బైక్‌లను ఆర్పేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బ్రెయిన్ డెడ్

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు


ఉపేందర్ పంతులు (ఫైల్)

తుర్కపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేసి మరో ఎనిమిది మందికి ప్రాణం పోశారు. వివరాలు.. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన తిరుకోవల్లూరి ఉపేందర్ పంతులు(56) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 3వ తేదీన అతడు పని నిమిత్తం బైక్‌పై తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా మాదాపూర్ గ్రామంలోని వైన్స్ వద్ద ఉన్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్ పంతులుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఉపేందర్ పంతులుని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అతడి బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఉపేందర్ పంతులు భార్య సరోజ, కొడుకు ప్రవీణ్ అనుమతితో గురువారం అతడి కళ్లు, కిడ్నీలు, లివర్, గుండెను జీవనదాన్ సంస్థకు స్వచ్ఛందంగా అందజేశారు. ఉపేందర్ పంతులు తన ప్రాణాలు వదులుతూ మరో 8మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని, ఆ కుటుంబాన్ని డాక్టర్ల బృందం అభినందించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.